రిటైర్డ్ ఏఎస్సైకి మాజీ ఎమ్మెల్యే రావుల పరామర్శ

ఖిల్లాఘణపురం, జూలై 27: మండలకేంద్రానికి చెందిన రిటైర్డ్ ఏఎస్సై రాములు పక్షవాతంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వనపర్తి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు రావుల చంద్రశేఖర్ రెడ్డి శనివారం దవాఖానకు చేరుకొని రాములును పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

రాములును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రావుల

క్రీడలతో శారీరక దారుఢ్యం

● జిల్లా యువజన క్రీడల అధికారి బీఎస్ ఆనంద్

అథ్లెట్లను అభినందిస్తున్న జిల్లా యువజన క్రీడల అధికారి ఆనంద్

గద్వాల రూరల్, జూలై 27: క్రీడలతో శారీరకదారుఢ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా యువజన క్రీడల అధికారి బీఎస్ ఆనంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14-20వరకు బాలికలు, బాలురకు పరుగు పందెం, జావలిన్ త్రో నిర్వహించారు. క్రీడలలో ఆయా మండలాల నుంచి 350మంది పాల్గొనగా ప్రతిభచాటిన 20 మందిని స్టేట్ లెవెల్ పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి మెడల్స్ అందించి ఆగస్టు 7న రంగారెడ్డి జిల్లాలో జరిగే పోటీల్లో సత్తా చాటాలని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన అథ్లెట్లను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, జిల్లా అధ్యక్షుడు బీసన్న, ప్రధాన కార్యదర్శి సతీశ్‌కుమార్, నగేశ్‌బాబు, ఆనంద్‌కుమార్, బషీర్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

పశువుకు చికిత్స చేస్తున్న సిబ్బంది

గట్టు, జూలై 27: పశువైద్య శిబిరాలను పాడి పోషకులు వినియోగించుకోవాలని ఎంపీడీవో చెన్నయ్య కోరారు. మండలంలోని బోయలగూడెంలో ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఫౌండేషన్ సహకారంతో సమగ్ర గ్రామీణ అభివృద్ధి(ఐవీడీపీ) కార్యక్రమంలో భాగంగా భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పశువైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది పశువులకు వాక్సిన్ చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై పశుపోషకులు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పశువైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. అనంతరం ఎంపీడీవో పాఠశాలను సందర్శించి హెచ్ఎంకు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీఎస్ శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్లు పృథ్వీరావు, కనకరాజు, ఏఈవో భక్తవత్సలం, భవిష్య భారత్ డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ బాలరాజు రాజారాం, లైవ్లీహుడ్ అధికారి హరికృష్ణ, అడ్మిన్ అసిస్టెంట్ మునిస్వామి పాల్గొన్నారు.

పనిమనిషితో యువ నాయకుడి అక్రమ సంబంధం?

● అధికారం అడ్డం పెట్టుకొని వ్యవహారం సద్దుమణిగేందుకు ప్రయత్నం

● సామాజిక మాధ్యమాల్లో పెద్దమొత్తంలో ఆరోపణలు

గద్వాల అర్బన్, జూలై 27: జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువ నాయకుడు వివాహిత పని మనిషితో చీకటి రాసలీలల భాగోతం నడిపినట్లు సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నది. పనిమనిషితో చనువు పెంచుకొన్న యువ నాయకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్రమ సంబంధానికి తెరలేపినట్లు తెలిసింది. ఈ వ్యవహారం కొద్ది రోజులుగా ఇద్దరి మధ్య ఉన్న సంబంధం భర్తకు అనుమానం వచ్చి భార్యపై నిఘా పెట్టాడు. ఇద్దరు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఏకాంతంగా గడుపుతుండగా.. భర్త రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో వివాహిత భర్త యువ నాయకుడికి దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టేందుకు వెళ్లగా.. యువ నాయకుడికి అండగా బడా నాయకులు రంగంలోకి దిగారు. విషయం బయటకు పొక్కితే తమ గౌరవం పోతుందని.. బేరసారాలు చేసినట్లు ఆరోపణలు గుప్పుమన్నాయి. అసలు విషయం సద్దుమణిగేలా అధికారం అడ్డం పెట్టుకొని ముమ్మరం ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. ఈ విషయం ఆ నోటాఈ నోట పడుతూ సామాజిక మాధ్యమాల్లో దావ ణంలా ప్రచారమైంది. అయితే ఓ పార్టీ యువ నాయకులు తమ గురించే న్యూస్ రాశారంటూ పత్రికా విలేకరులపై అసత్య ఆరోపణలకు పూనుకున్నారు. ఈ విషయంపై గద్వాల టౌన్ ఎస్సై శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. మహిళలకు సంబంధించి ఎలాంటి కేసు రాలేదని, పార్టీ పేరుతో సామాజిక మాధ్యమాల్లో అసత్య ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది.

ఆధునిక పద్ధతుల్లో లాభసాటి సేద్యం

● పీహెచ్‌సీల్లో ప్రసవాలసంఖ్య పెంచాలి

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

పాన్‌గల్, జూలై 27: ఆధునిక పద్ధతుల్లో లాభసాటి సేద్యం చేసేందుకు ప్రతిరైతుకూ వ్యవసాయ విస్తీర్ణాధికారులు అవగాహన, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. శనివారం ఉదయం వనపర్తిలోని పాతమార్కెట్ గంజిలో గ్రోమోర్ ఫర్టిలైజర్ షాపును డీఏవో సుధాకర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అప్పుడే ఎరువులు కొనుగోలు చేయడానికి వచ్చిన పాన్‌గల్ మండలం కొత్తపేట రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఎంత పొలం ఉన్నది, ఏ పంట వేస్తున్నారు? ఏ రకమైన మందులు వాడుతున్నారు. ఎకరాకు ఎంత మోతాదులో రసాయని ఎరువులు వాడుతున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. అందుకు సమాధానాలను ఇచ్చిన రైతులకు ఇవన్నీ మీకు ఎవరు చెప్పారు? మీ వ్యవసాయ విస్తీర్ణాధికారి మీకు సలహాలు, సూచనలు ఇచ్చారా? వంటి ప్రశ్నలు వేశారు. ప్రతి క్లస్టర్‌లో వ్యవసాయ విస్తీర్ణాధికారులు రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు చేయాలని, రైతులకు వ్యవసాయ ఆధునిక పద్ధతులపై సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఎరువుల నిల్వలు, రిజిస్టర్లు పరిశీలించారు. రిజిస్టర్‌లో ఉన్న నిల్వలు, ఈపాస్ యాప్‌లో ఉన్న నిల్వలతో సరిపోల్చి చూశారు. అలాగే పాన్‌గల్ మండలం అన్నారం గ్రామానికి చేరుకొని అక్కడ రైతులతో వ్యవసాయ విస్తీర్ణాధికారి క్రాప్ బుకింగ్ చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. బాలయ్య రైతు తన 4ఎకరాల పొలంలో చేపడుతున్న క్రాప్ బుకింగ్ విధానాన్ని పరిశీలించారు.

పీహెచ్‌సీలో ప్రసవాలసంఖ్య పెంచాలి

మండలకేంద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామాల్లో గర్భిణులు ప్రైవేట్ దవాఖానలకు వెళ్లకుండా ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలు సంఖ్యను పెంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. రిజిస్టర్లు పూర్తిస్థాయిలో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి గర్భిణికి మొదటి త్రైమాసికంలోనే ఏఎన్‌సీ పరీక్షలు చేసి ఆన్‌లైన్‌తోపాటు రిజిస్టర్లలో నమోదు చేయాలని కోరారు. రోజుకు ఎంతమంది ఓపీలు వస్తున్నారు. టీహబ్ వాహనం ఎన్ని గంటలకు వస్తుంది, రక్త పరీక్షల రిపోర్టు ఎప్పుడు ఇస్తున్నారనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రసూది గదిలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కను నాటారు. మండలంలోని అన్నారం తండా ప్రాథమిక పాఠశాల పనులు పరిశీలించారు. పాఠశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి జయచంద్ర మోహన్, డాక్టర్లు సాయినాథ్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ పరిమళ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నారంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కలెక్టర్ ఆదర్శ్ సురభికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ గిరిధర్

కలెక్టర్ కలిసిన ఎస్పీ గిరిధర్

వనపర్తి టౌన్, జూలై 27: ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రావుల గిరిధర్ శనివారం కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలెక్టరేట్‌లో పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు, పోలీస్ శాఖ, అధికార యంత్రాంగం మధ్య సమన్వయం, జిల్లాకు సంబంధించి పలు అంశాలపై వారు చర్చించారు. జిల్లాలో శాంతియుత వాతావరణం, నేరాల నియంత్రణకు సమిష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. వీరితోపాటు ఉన్న తాధికారులు తదితరులు ఉన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

● సఖీ కేంద్రం చీఫ్ లీగల్‌సెల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బాలనాగయ్య

అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం చీఫ్ బాలనాగయ్య

వనపర్తి టౌన్, జూలై 27: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం చీఫ్ లీగల్‌సెల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బాలనాగయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో గృహహింస, రాజ్యాంగంలోని చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. లోక్ అదాలత్, ఉచిత న్యాయ సేవలు, గృహహింస చట్టాలు, మహిళలకు కల్పిస్తున్న హక్కులు, బాధ్యతలు, బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పిల్లలపై వివక్ష చూపరాదని, అన్యాయవాలకు పాల్పడిన వారికి సహాయం చేయరాదని, సమాజంలో జరిగే అవినీతిని నిర్మూలించాలన్నారు. అదేవిధంగా సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత మాట్లాడుతూ.. మహిళలు, బాధింపబడినవారి సమస్యలపై సఖి కేంద్రం న్యాయ సహాయం అందిస్తుందని, 18ఏండ్లు వచ్చిన తర్వాత పిల్లలు వాళ్ల ఇష్టం వచ్చిన నిర్ణయాలు తీసుకుంటారని, తల్లిదండ్రులు, వయోవృద్ధులైనప్పుడు వాళ్లను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలకు ఉందన్నారు. మహిళలకు ఉచిత న్యాయ సహాయం వర్తిస్తుందన్నారు. క్రిమినల్, సివిల్ కేసులకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. గృహహింసకుగురవుతున్న మహిళలు సఖి కేంద్రాన్ని ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ సెల్ ఎయిడ్ కౌన్సిల్ ఉత్తరయ్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామఓబులేశ్, అధ్యాపకులు ఉమా, సునీత, సురేందర్‌రెడ్డి, సఖి కేంద్రం నిర్వాహకులు, లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

పవర్ డోర్‌లు ఏర్పాటు చేయాలి

వనపర్తి టౌన్, జూలై 27: టీజేఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వనపర్తి డిపో కమిటీ ఆధ్వర్యంలో శనివారం డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంలో భాగంగా బస్సుల్లో మహిళా ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణించడంతో ప్రయాణికులు, డ్రైవర్లు, కండక్టర్లు ఎంతచెప్పినా.. మహిళలు డోర్ దగ్గర నుంచి లోపలికి వెళ్లడం లేదని.. దీంతో తరచుగా ప్రయాణికులు డోర్‌లో నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలు కాకుండా బస్సుకు పవర్ డోర్ సౌకర్యం కల్పించాలని, ఈ ప్రమదాలకు డ్రైవర్స్, కండక్టర్లపై చర్యలు తీసుకోకూడదని డీఎంను కోరారు. అదేవిధంగా ఆత్మకూరు, ఘణపురం, మహబూబ్‌నగర్ రూట్‌లలో టైమింగ్స్ సరిచేయాలని పలు అంశాలపై డీఎంకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి కృష్ణయ్య, అధ్యక్షుడు స్వామి, రీజియన్ సహ కార్యదర్శి ఎండీ ఖయ్యూం, ప్రచార కార్యదర్శి నాగేశ్వర్, గోవర్ధన్, ఏజీ కృష్ణ పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

అమరచింత, జూలై 27: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మాదిగ సంఘాల మహాకుటమి ఆధ్వర్యంలో ఆగస్టు 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని మాదిగలు విజయంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి విజయ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి స్థానిక నాయకులతో కలసి చలోఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రన్, గోపాల్, కుర్మన్న, శ్రీకాంత్, కల్యాణ్, రాజన్న, అశోక్, జాన్ ఉన్నారు.

డీఎంహెచ్‌వోగా సిద్ధప్ప

గద్వాల అర్బన్, జూలై 27: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా సిద్ధప్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించే శశికళ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న సిద్ధప్ప పూర్తి స్థాయిలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇతర అధికారులు సిద్ధప్పకు శుభకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కాంక్షించారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో సిద్ధప్ప

నాణ్యమైన భోజనం అందించాలి

అమరచింతలో భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

అమరచింత, జూలై 27: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మోను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో స్థానిక ఎస్ఎఫ్ఐ నేతలతో కలిసి మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమస్యలపై ఆరాతీశారు. ప్రతిరోజూ సంబారు మాత్రమే పెడుతున్నారని, అలాగే అన్నంలో పురుగులు వస్తున్నాయని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేయడంతో అక్కడే ఉన్న వంట ఏజెన్సీ సభ్యులను ఎస్ఎఫ్ఐ నేత నిలదీశారు. బియ్యం చాలాసార్లు కడిగినా లక్క పురుగులు మాదిరిగా ఉన్నాయని వంట ఏజెన్సీలు సమాధానం చెప్పారు. ప్రభుత్వం నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని, ప్రతిరోజూ సంబారు భోజనం పెట్టడంపై విద్యాశాఖ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పాన్‌గల్, జూలై 27: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈవో సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు రాయడం, చదవడం, లెక్కించడం వంటి విద్యా సామర్థ్యాలు నేర్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పాఠశాల సమయపాలన పాటించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరశేఖరాచారి, సీఆర్పీ గోవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాషా ప్రావీణ్యంపై పట్టు సాధించాలి

మదనాపురం, జూలై 27: విద్యార్థులు భాషా ప్రావీణ్యంపై పట్టు సాధించాలని జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మద్దిలేటి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో నోబ్యాగ్ డే(పుస్తక రహిత) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ టీచర్స్ స్వరాజ్యం, కుర్మన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్య ప్రాముఖ్యత, విలువలను పాటించి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలన్నారు. తాము విద్యార్థి దశ నుంచే ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, క్రమశిక్షణను అలవరుచుకొని వివిధ రకాల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా

విద్యార్థినికి నగదు బహుమతిని అందజేస్తున్న దృశ్యం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాజోళి, జూలై 27: సుంకేసుల డ్యాం నుంచి వస్తున్న వరదతో డ్యాం దిగువన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజోళి తాసీల్దార్ హరికృష్ణ తెలిపారు. శనివారం ఆయన సుంకేసుల డ్యాం గేట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వరద వివరాలను డ్యాం అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో మత్స్యకారులు నదిలో చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరించారు. వరద వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందజేస్తామని తాసీల్దార్ పేర్కొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

కొత్తకోట, జూలై 27: మున్సిపాలిటీలో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్ మహిళా కార్మికులకు రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ శనివారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రభుత్వ పథకాల్లో తమ వంతుగా ప్రజలకు పని చేస్తారని, మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, స్త్రీనిధి నుంచి రుణాలను సకాలంలో చెల్లించే విధంగా కృషి చేస్తున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణలో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ఉద్యోగ పరంగా సమయపాలన అంటూ లేకపోవడం ద్వారా అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశినికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్పీలు జగదీశ్వర్‌రెడ్డి, యాస్మిత్, సౌజన్య, పద్మ, లావణ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బోనాల సంబురం

అయిజ, జూలై 27: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా బోనాల సంబరాలను వైభవంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని గీతాంజలి, అక్షర ఉన్నత పాఠశాలల్లో బోనాలను పురస్కరించుకొని విద్యార్థులు వివిధ రకాల వేషధారణతో ఆకట్టుకున్నారు. బోనాల ఉత్సవంలో విద్యార్థులు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. పోతరాజు వేషధారణలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు వెంకటేశ్, మహేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బోనాల సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉన్నత విద్యలో ప్రతిభకన బర్చాలి

అయిజ, జూలై 27: పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించి తల్లిదండ్రులు, పాఠశాలకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జిల్లా కోశాధికారి రమేశ్‌బాబు సూచించారు. శనివారం పట్టణంలోని లయోలా ఉన్నత పాఠశాలలో 2023-24 ఏడాదిలో 10, 9.8 జీపీఏ సాధించిన విద్యార్థినులు తేజస్విని, శృతిహాసన్‌ను కరస్పాండెంట్ సన్నీతో కలిసి సన్మానించారు. అనంతరం నగదు బహుమతిని అందేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాటరీలు వచ్చేశాయ్

గట్టు, జూలై 27: రిజిస్ట్రేషన్ కోసం గట్టు తాసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతుల కష్టాలు తీరనున్నాయి. కార్యాలయాని కొత్త బ్యాటరీలను తెప్పించారు. అంతేకాకుండా ఏండ్లుగా పనిచేయకుండా ఉన్న ప్రింటర్ కూడా అందుబాటులోకి వచ్చింది. ధరణికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టినప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు రిజిస్ట్రేషన్‌లు ఆగిపోయేవి. దీంతో రైతుల ఇబ్బందులు పడేవారు. విద్యుత్ వచ్చేదాకా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. అదేవిధంగా ఏండ్ల నుంచి ప్రింటర్ కూడా మూలపడింది. దీన్ని కూడా ఇటీవల బాగుచేయించారు. ప్రింటర్ లేని పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఇక్కట్లు పడేవారు. తమ పట్టాదారు పాసుపుస్తకాల్లో తాము కొనుగోలు, అమ్మకాలు చేపట్టిన పొలాల వివరాలను ఇతర మండలాల్లోని తాసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి నమోదు చేయించేవారు. మొత్తంమీద కార్యాలయానికి బ్యాటరీల తోపాటు ప్రింటర్ రావడంతో రైతుల ఇక్కట్లు తొలగిపోయాయి. ఈ ఇక్కట్లను గతంలో 'నమస్తే తెలంగాణ' కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే.

'సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో కోత'

అమరచింత, జూలై 27: తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలనే లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కోతలు పెట్టిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ విమర్శించారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు కేటాయించిన బడ్జెట్‌కు పొంతనలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల హామీలకు తగ్గ నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు విజయ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

అబ్దుల్ కలాంకు ఘననివాళి

వనపర్తి టౌన్, జూలై 27: మాజీ రాష్ట్రపతి, అంతరిక్ష శాస్త్రవేత్త, మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను, అవార్డులను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజరాంప్రకాశ్, గిరిరాజాచారి, నర్సింహాశర్మ, మండ్ల దేవన్ననాయుడు, బండలయ్య, నర్సింహ, బాలేమియా, బాషా నాయక్, సతీశ్ ఉన్నారు.

ఉండవెల్లి మండలంలో..

ఉండవెల్లి, జూలై 27: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదర్శ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజే కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం వక్తలు ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆదర్శ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొత్తకోట మండలంలో..

కొత్తకోట,జూలై 27: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని కొత్తకోట పట్టణంతోపాటు కనిమెట్టలో శనివారం నిర్వహించారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో ఉమ్మడి జిల్లాల రైతు సంఘం నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలాం దేశానికి ఆయన చేసిన సేవలు అణుశక్తిని పటిష్టం చేశారని గుర్తు చేశారు. విద్యార్థులు ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు రాణి, పరమేశ్, నాగరాజు, లక్ష్మయ్య, వెంకటేశ్, ఆశన్న, బాల్‌రెడ్డి, శ్యాం పాల్గొన్నారు.

ధరూర్ మండలంలో..

ధరూరు, జూలై 27: మండలంలోని మాల్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో శనివారం గ్రామ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి అబ్దుల్ షుకూర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అంజిసాగర్, రాజు, వకీల్ నర్సింహులు, రాములు, నాగేంద్రం, సాయిసాకేత్ సాగర్, ఉపాధ్యాయురాలు రేష్మ బేగం, హెడ్ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లిలో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తకోటలో నివాళులర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

TOLET SHOPS
★ Tolet Shops Near one town Police Station, Beside Apollo Pharmacy, Mahabubnagar. Contact: 9542300569.
NT-MBNR

PLOT FOR SALE
★మహబూబ్‌నగర్ ఐటీ ప